# బాలూ
# పాటవై వచ్చావు భువనానికి



సంస్కృతి గుంటూరు

**బాలూ... పాటవై వచ్చావు భువనానికి**
(ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం స్మృతిసంచిక)

సంకలనం:
**మోదుగుల రవికృష్ణ**
9440320580

సహకారం:
**శెట్లెం చంద్రమోహన్**
96661 88195

ప్రచురణ:
**సంస్కృతి,** గుంటూరు.

ప్రచురణ సంఖ్య: **13**

ప్రతులు: **1000**

200/-

మొదటిఅట్ట:
**వాసు**
98483 47958

నాల్గవఅట్ట & ముఖపత్రాలంకరణ:
అరసవల్లి గిరిధర్‌లాల్
97042 44344

డిటిపి:
రావిపాటి పరమేశ్వర్
99852 97169

లే అవుట్:
లక్ష్మీప్రసన్న గ్రాఫిక్స్
98660 16690

ముద్రణ:
శ్రీశ్రీ ప్రింటర్స్, విజయవాడ
94906 34849

# లోపలి సంగతులు...


| | | | |
|---|---|---|---|
| 1. | మరువలేని మహామనీషి | శ్రీ యం. వెంకయ్యనాయుడు<br>గౌరవనీయ భారత ఉపరాష్ట్రపతి | 7 |
| 2. | అద్వైతసిద్ధికి అమరత్వలబ్ధికి గానమె సోపానము | మహమ్మద్ ఖదీర్‌బాబు | 11 |
| 3. | బాలు తీరని కోరిక నాకు తెలిసి ఒకే ఒకటి... | శ్రీరమణ | 17 |
| 4. | గానగంధర్వుడు ఎస్పీ బాలు... జీవనప్రస్థానం | ఆచారం షణ్ముఖాచారి | 20 |
| 5. | మానవత్వం పరిమళించిన మంచిమనిషికి వందనం | | 31 |
| 6. | అతడు బిలహరి కాకపోవచ్చు కానీ.... | | 33 |
| 7. | ఏకబిల్వం శివార్పణమ్ | తనికెళ్ల భరణి | 37 |
| 8. | సంస్కారం నేర్పిన మహానుభావుడు | సిరివెన్నెల సీతారామశాస్త్రి | 44 |
| 9. | అత్యాధునిక టెక్నాలజీతో స్వారీచేసిన<br>రాకుమారుడు బాలు | శ్రీరమణ | 46 |
| 10. | ఆబాలగోపాలానికి ఆరాధ్యుడైన బాలు | డాక్టర్ కె.ఐ. వరప్రసాద్‌రెడ్డి | 49 |
| 11. | ఆబాలగోపాల సుబ్రహ్మణ్యం మన బాలసుబ్రహ్మణ్యం | వెన్నెలకంటి | 53 |
| 12. | బాలూతో నా కథ | మహమ్మద్ ఖదీర్‌బాబు | 55 |
| 13. | బాలూ సర్... | సుకుమార్ | 58 |
| 14. | ఎవరండీ ఈ బాలసుబ్రహ్మణ్యం? | మంగు రాజగోపాల్ | 60 |
| 15. | అతడో... మాటల మంత్రశాల | సుద్దాల అశోక్‌తేజ | 63 |
| 16. | ఎడారిసీమలో తెలుగుగానం | మొహమ్మద్ ఇర్ఫాన్ | 66 |
| 17. | ముద్దుబిడ్డ – బాలు | జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి | 68 |
| 18. | డాన్స్ చేసిన గొంతు లేదా యురేకా | మహమ్మద్ ఖదీర్‌బాబు | 72 |
| 19. | దేవగణం మధ్యలో గానగంధర్వుడు | | 75 |
| 20. | విపంచివై వినిపించితివి ఈ గీతాలు | డా॥ సిహెచ్. సుశీల | 77 |
| 21. | బాలు సంగతులు...ఇంకొన్ని...మరికొన్ని... | | 82 |

| | | | |
|---|---|---|---|
| 22. | బాలు...ప్రజ్ఞాయశస్సు...స్నేహ ఉషస్సు | డాక్టర్ కె.వి. వరప్రసాద్‌రెడ్డి | 88 |
| 23. | బాలు...నేను...నేను...బాలు... | అనిల్ డ్యాని | 95 |
| 24. | వర్ణచిత్రమాలిక | | 97 |
| 25. | ఎడతెగని పాట | | 105 |
| 26. | పాటకు మణిమకుటం | | 108 |
| 27. | నిష్క్రమించిన దిగ్గజం | | 110 |
| 28. | ఒంటరి పాటల్లో...తెల్లారని రేయిలా... | అజయ్‌శాంతి | 113 |
| 29. | దిగి రా...దివి నుంచి భువికి | వనమాలి | 115 |
| 30. | సమ్మోహన గానం...సమబాహు త్రిభుజం | ఓలేటి శ్రీనివాసభాను | 118 |
| 31. | ప్రజ్ఞ పాటల బాలు | సన్నిధానం నరసింహాశర్మ | 122 |
| 32. | బాలూ చేసిన మేలు | ఆరుద్ర | 123 |
| 33. | The magic of SPB lay in his profound musical mind | T.M. Krishna | 127 |
| 34. | His First Song Recording | | 131 |
| 35. | అలవాటైన గొంతు... | పూదూరి రాజిరెడ్డి | 134 |
| 36. | నాన్న | ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం | 136 |
| 37. | బాలూ ఓపెన్ హార్ట్ విత్ ఆరె.కె. | వేమూరి రాధాకృష్ణ | 140 |
| 38. | బాలూగారితో నా అనుబంధం | డాక్టర్ మర్మావుల సుబ్రహ్మణ్యం | 168 |
| 39. | త్రివిక్రమ బాలం | పిన్నమనేని మృత్యుంజయరావు | 172 |
| 40. | విశ్వగాయకుడు | శశాంక | 175 |
| 41. | ఆలీతో సరదాగా బాలు | ఆలీ | 176 |
| 42. | Obituary | Priya Arora | 205 |
| 43. | ఉభయకుశలోపరి | పి.టి.ఎస్.కె. రాజన్ | 209 |



# మరువలేని మహామనీషి

**- శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు**

గౌరవనీయ భారత ఉపరాష్ట్రపతి

ప్రతిరోజూ ప్రాతఃకాలాన నిద్ర లేచి దినచర్య ప్రారంభించే ముందు అన్నమాచార్యుల కీర్తనలు, ఘంటసాల, బాలసుబ్రహ్మణ్యం పాటలు విని ఇతర కార్యక్రమాలు ప్రారంభిస్తాను. అంతగా వారి గాత్రం నా జీవితంలో అంతర్భాగమైపోయింది. ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం ఆరోగ్యపరిస్థితి చాలా విషమంగా ఉందని తెలిసిననాటి నుంచి 'బాలూ... నీ మధురస్వరం వినకుండా ఎలా ముందుకు వెళ్లగలను' అనే ఓ భావన మనసులో మొదలై, కలచివేసింది. బాలసుబ్రహ్మణ్యం ఆస్పత్రిలో చేరిన నాటి నుంచి దాదాపు ప్రతిరోజూ వైద్యులతో మాట్లాడుతున్నాను. 'ఆరోగ్యం మెరుగుపడుతోంది', 'రాసి చూపిస్తున్నారు', 'సంకేతాలు చేస్తున్నారు', 'వైద్యానికి స్పందిస్తున్నారు', 'మాట్లాడుతున్నారు', 'టీవీ చూస్తున్నారు', 'క్రికెట్ మ్యాచ్ చూసేందుకు ఆసక్తి చూపుతున్నారు', 'ఉదయం సాయంత్రం కొంత సమయం కుటుంబసభ్యులతో గడుపుతున్నారు'... ఇలా వారి ఆరోగ్యం కుదుటపడుతోందని తెలియజేసిన ప్రతి వార్తా మనసుకు కాస్త ఊరటనిచ్చేది.

అమెరికాలోని బోస్టన్, మాయో క్లినిక్‌కు చెందిన ప్రముఖ వైద్యులతో పాటు, భారతదేశంలోని నిపుణులైన వైద్యుల సలహాలు తీసుకుంటున్నామని ఎం.జి.ఎం. వైద్యులు చెప్పారు. దక్షిణభారతంలోని ప్రముఖ వైద్యనిపుణుల్నీ సంప్రదించి సలహాలు తీసుకోవాలని ఆస్పత్రివర్గాలకు సూచించాను. వారిచ్చిన సలహాలు ఏమిటో తెలియ జేయడమే గాక, అవన్నీ పాటిస్తున్నామని, పరిస్థితి మెరుగుపడుతోందని, కాకుంటే కాస్త సమయం పడుతుందని

వైద్యులు చెబుతూ వచ్చారు. వారి కోసం ఫిజియోథెరపీ యంత్రం అవసరమని నాకు తెలియజేయగా, అపోలో ఆస్పత్రి ఛైర్మన్ ప్రతాపరెడ్డితో మాట్లాడి వారి దగ్గర ఉన్న యంత్రాన్ని తరలించి, చికిత్స అందించే ఏర్పాటు చేయడం జరిగింది. దీనివల్ల వారి ఆరోగ్య పరిస్థితి చాలా మెరుగుపడిందని వైద్యులు తెలియజేస్తూ వచ్చారు. నాలుగు రోజుల ముందు అయితే, పరిస్థితి ఇంకా మెరుగుపడిందనే వార్త రావడంతో, వారు ఆస్పత్రి నుంచి కోలుకుని మన ముందుకు త్వరలోనే వస్తారని ఎంతో సంతోషంగా ఎదురు చూస్తూ వచ్చాను. నా శ్రీమతి ఉషమ్మ సైతం వారు క్షేమంగా తిరిగి మన మధ్యకు రావాలని మనసారా కోరుకున్నారు. వారి ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ పూజలు చేసేవారు. నాకు చెప్పేవారు. కోలుకుంటున్నారని తెలిసి ఆనందపడ్డారు. చాలామంది నాకు ఫోన్లు చేసి మాట్లాడే సమయంలోనూ ఇలాగే ప్రార్థనలు చేస్తున్నామని చెప్పేవారు. ఇలాంటి తరుణంలో ఈ దుర్వార్త మా మనసులను తీవ్రంగా కలచి వేసింది.

మా ఊరివాడు, మన తెలుగువాడు, మన తెలుగువెలుగును జాతీయస్థాయిలో ఆలపించినవాడు, సంగీతప్రపంచానికి తరగని ఆస్తిగానే కాకుండా, నాపట్ల అపారమైన అభిమానం కలిగినవాడు కావడమూ కారణం కావచ్చు...అన్నింటికీ మించి శ్రీపతి పండితారాధ్యుల సాంబమూర్తిగారి అంకితభావాన్ని అలవరచుకుని అందరినీ అలరిస్తున్నాడనీ కావచ్చు. బాలూ అంటే నాకు మొదటి నుంచి ప్రత్యేక అభిమానం. నా చిన్నతనంలో వారితండ్రి వీధి వీధి తిరిగి హరికథాగానం ద్వారా అందరిలో భక్తిభావం కలిగించేవారు. తద్వారా నిధులు సేకరించి, ఆయన ఇతరులతో కలిసి చొరవ తీసుకుని – ప్రముఖ సంగీతకళాకారులను నెల్లూరుకు పిలిపించి త్యాగరాజు ఆరాధనోత్సవాలను నిర్వహించేవారు. ఈ సందర్భంగా శ్రీమతి డి.కె.పట్టమ్మాళ్, శ్రీమతి ఎం.ఎస్. సుబ్బులక్ష్మి, చెంబై వైద్యనాథ భాగవతార్, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, వీణ కళాకారులు చిట్టిబాబు, ఎం.ఎల్.వసంతకుమారి, వయోలిన్ వాద్యకారులు లాల్గుడి జయరామన్, మృదంగచక్రవర్తి టి.కె.మూర్తి లాంటి ఎంతోమంది కళాకారులను నెల్లూరుకు పిలిపించి, వారి సంగీతమాధుర్యాన్ని ఆస్వాదించే అవకాశాన్ని నెల్లూరు ప్రజలకు కలిగించారాయన. బాలసుబ్రహ్మణ్యంపట్ల నాకు అభిమానం పెరగడానికి బహుశా ఇవన్నీ కారణాలు అయ్యి ఉండవచ్చు. ముఖ్యంగా జీవితంలో కష్టపడి పైకి వచ్చి, ఎంత ఎదిగినా ఒదిగి ఉండే వారి స్వభావం నన్ను విశేషంగా ఆకట్టుకునేది. భాష, సంస్కృతులపట్ల అభిమానం మా ఇద్దరినీ దగ్గర చేయడమే గాక, మామధ్య సంబంధబాంధవ్యాలు పెరగడానికి దోహదపడింది.

వారి ప్రతిభావిశేషాల గురించి ఎంత చెప్పుకొన్నా తక్కువే. ఆయన కొన్ని దశాబ్దాల పాటు సినీ సంగీతప్రపంచాన్ని ఏలారనే చెప్పాలి. ఎన్నో భాషల్లో మరెందరో కథానాయకులకు వారి గాత్రంలోకి పరకాయ ప్రవేశం చేసి పాటలు పాడే బాలు ప్రతిభ ప్రతి ఒక్కరినీ మంత్రముగ్ధుల్ని చేసేది. దాంతోపాటు మరెంతోమంది నటుల నటనాశైలికి, హావభావాలకు, గాత్రధర్మానికి అనుగుణంగా పాటలు పాడే ప్రత్యేకత ఎన్నో అవకాశాలను వారి ముందుకు తెచ్చిపెట్టింది. వారి తెలుగుభాష ఉచ్చారణ సైతం ఆనందాన్ని కలిగించేది. పాటల్లోగానీ, మాటల్లోగానీ తెలుగుపలుకులకు వారు ఇచ్చే గౌరవం, భాషపట్ల వారికున్న ప్రేమ...ఇవన్నీ వారిపట్ల అభిమానాన్ని, గౌరవాన్ని మరింత పెంచాయి. నేను కేంద్రసమాచారప్రసారశాఖ మంత్రిగా ఉన్నప్పుడు శతవసంత



# గానగంధర్వుడు ఎస్పీ బాలు... జీవనప్రస్థానం

**- ఆచారం షణ్ముఖాచారి**
సినీవిశ్లేషకులు

**సం**గీతం అనేది విశ్వజనీనం. ప్రకృతిలో సౌందర్యసమన్వితంగా పంచభూతాలలో హృదయాన్ని ఆకర్షించే నాదం ఉంది. ఏ కాలమైనా ఏ దేశమైనా ప్రపంచవ్యాప్తంగా మానవహృదయాలను సంగీతం తన్మయింపజేస్తుంది. 'శిశుర్వేత్తి పశుర్వేత్తి' అనేది ఆర్యోక్తి. సృష్టిలో సంగీతానికి ప్రకృతే పరవశిస్తుంది. నృత్య వాద్యాలతో స్వరసమ్మేళన రాగమాధుర్యంతో హృదయాలను సమ్మోహింపచేసే సంగీతానికి ఎల్లలు లేవు. వాటిలో సినిమా సంగీతం జనరంజకమైనది. ఘంటసాల వంటి ఎందరో మహానుభావులు తెలుగు సినీసంగీతానికి పునాది వేసి జాగృతం చేశారు. తదనంతరకాలంలో ఆ పునాదిపై సంగీతసౌధాన్ని నిర్మించింది 'బాలు' అని ముద్దుగా పిలుచుకొనే శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం. అతడు ఎంత ఎత్తుకెదిగినా ఎల్లలు దాటని యోగిపుంగవుడు. ఆబాలగోపాలాన్ని కట్టిపడేసే సమ్మోహనశక్తి బాలు గళానికే కాదు అతని వ్యక్తిత్వానికీ వుంది. బాలు సినీసంగీతప్రపంచానికి పరిచయమై యాభై ఏళ్లు దాటింది. అయినా ఆ కంఠస్వరంలో

అదే రసవాహిని ఉప్పొంగుతోంది..మాధుర్యం అంబరాన్ని అంటుతోంది. 'పాడుతా తీయగా', 'స్వరాభిషేకం' వంటి రాగసాగరికల ద్వారా ఖండాంతరాలలో వుండే భారతీయసంతతిని సైతం సంగీతం వైపు పయనింప జేస్తున్నారు. ముఖ్యంగా బాలబాలికల నుంచి యువతేజం వరకు సంగీతస్ఫూర్తిని ఇనుమడింపజేస్తున్నారు. ఇంతింతై, వటుడింతై, నభోవీధిపైనంతై, ప్రభారాశిపైనంతై, బ్రహ్మాండాంతసంవర్ధియైన ఈ బాలసంగీత విద్వాంసుడు జూన్ 4వ తేదీన 74 సంవత్సరంలోకి ప్రవేశించారు. కానీ ఇంతలోనే అభిమానుల ఆశను వమ్ము చేస్తూ... పైలోకాలకు పయనమైపోయారు.

## తొలిరోజుల్లో బాలు...

బాలు జన్మించింది జూన్ 4, 1946న కోనేటమ్మపేట అనే గ్రామంలో. తండ్రి సాంబమూర్తి నిష్ఠాగరిష్ఠుడైన హరికథా భాగవతార్. ఆయన భక్తిరస నాటకాలు కూడా ప్రదర్శిస్తూ వుండేవారు. తల్లి శకుంతలమ్మ గృహిణి. బాలుకి చిన్నతనం నుంచి సంగీతం మీద ఆసక్తి. సంగీతంలో బాలుకి తొలి గురువు తండ్రిగారు. ఐదేళ్ల వయసులో బాలు 'భక్తరామదాసు' నాటకంలో తండ్రితో కలిసి నటించారు. ప్రాథమిక విద్యను నగరిలో మేనమామ శ్రీనివాసరావు ఇంట పూర్తి చేసి, స్కూలు ఫైనల్ విద్యను శ్రీకాళహస్తి బోర్డు స్కూలులో కొనసాగించారు. అప్పుడు చదువులోనే కాదు, ఆటల్లోకూడా బాలు స్కూలులో ప్రథముడే. ఆ స్కూలులో పనిచేసే జి.వి.సుబ్రహ్మణ్యం అనే మాస్టారు బాలుచేత 'చెంచులక్ష్మి' సినిమాలో సుశీల ఆలపించిన 'పాలకడలిపై శేషతల్పమున' అనే పాటను పాడించి టేప్ మీద రికార్డు చేశారు. బాలుకి అదొక మధురానుభూతి. మరో మేష్టారు రాధాపతి ప్రోత్సాహంతో 'ఈ ఇల్లు అమ్మబడును', 'ఆత్మహత్య', వంటి నాటికల్లో నటించి ప్రేక్షకుల మన్నన పొందారు. తిరుపతి శ్రీ వెంకటేశ్వర ఆర్ట్స్ కాలేజిలో పి.యు.సి. చదువుతుండగా మద్రాసు ఆలిండియా రేడియోలో ప్రసారమయ్యే ఒక నాటకంలో స్త్రీ పాత్ర ధరించే అవకాశం వచ్చింది. తరువాత విజయవాడ ఆకాశవాణిలో తను స్వయంగా రాసి, బాణీ కట్టి ఆలపించిన ఒక లలితగీతానికి బహుమతి లభించింది. పి.యు.సి. పరీక్షలు రాసి నెల్లూరు చేరుకొని బాలు ఒక ఆర్కెస్ట్రా బృందాన్ని తయారు చేశారు. మిత్రులతో కలిసి ప్రోగ్రాములు ఇచ్చేవారు. తరువాత అనంతపురంలో ఇంజనీరింగ్ సీటు రావడంతో అక్కడ చేరి, వాతావరణం నచ్చక మరలా నెల్లూరు వచ్చేశారు. ప్రత్యామ్నాయంగా మద్రాసు వెళ్లి ఇంజనీరింగ్ విద్యకు సరిసమానమైన ఎ.ఎం.ఐ.ఇ.లో చేరారు. అక్కడ చదువుతోబాటు సినిమాల్లో అవకాశాలకోసం ప్రయత్నాలు చేశారు. ఇంజనీరింగ్ కోర్సు రెండవ సంవత్సరం వచ్చేనాటికి బాలుకి సినిమాలో పాడే అవకాశం వచ్చింది. 'మహమ్మద్ బిన్ తుగ్లక్' అనే సినిమాలో రమాప్రభ పుట్టినరోజు వేడుకలో 'హ్యాపీ బర్త్ డే టు యూ' అంటూ పాటపాడుతూ తొలిసారి బాలు వెండితెరమీద దర్శనమిచ్చారు. తరువాత ఎన్నో సినిమాల్లో విభిన్నపాత్రలు పోషించి తనలోని నటుడికి పదును పెట్టారు.



# అతడు బిలహరి కాకపోవచ్చు కానీ....

నిన్న మధ్యాహ్నం రెండు గంటలప్పుడు బ్యాంకులో భోజనం చేస్తుంటే ఒక ఫేస్‌బుక్ మిత్రుడు ఫోన్ చేసి 'బాలు ఇక లేరు' అన్న వార్త చెప్పేసాడు. ఉదయం నుండి ఊహించిందే అయినా ఆ వార్త విన్నాక ఎందుకో కానీ మరి ముద్ద గొంతు దిగనని మారాం చేసింది. ఆ మిత్రుడు బాలు వార్త చెప్పి ఆగకుండా "బాలుకి ఫలానా గాయనికి మధ్య ఉన్న ఎఫైర్ నీకు తెలుసా? ఆయన దగ్గర బంధువే నాకు చెప్పాడు" అంటూ మరింకా ఏదో చెప్పబోయాడు కానీ నాకు అంత ఆసక్తి లేక " సర్...తరువాత...." అని పెట్టేసాను.

ఆ తరువాత రాత్రి ఎప్పుడో ఫేస్‌బుక్ ఓపెన్ చేస్తే ఆ మిత్రుడే "ఆహా బాలూ! ఓహో బాలూ!" అంటూ పెట్టిన పోస్ట్ ఒకటి కనిపించింది. మరొక మిత్రుడు "అతడికి సంగీతం ఏమి తెలుసు? అతడు నలభైవేల పాటలు పాడటం అతడిని గాయకుడుగా గుర్తించడానికి క్రైటీరియా కాదు" అన్నాడు. మరొక పోస్ట్ "సవాలక్ష స్వరాలలో అతడిదొక స్వరం. చావును సెలబ్రేట్ చేయడం ఏమిటి?" అని విసుక్కుంది. తెలంగాణా ఉద్యమం బలంగా ఉన్న కాలంలో "బాలసుబ్రహ్మణ్యం దొడ్డుగొంతును ఆంధ్రావాళ్లు బలంగా రుద్దారు" అని ఒక కవిగాయకుడు వాక్రుచ్చాడు.

మరికొంతమంది అతడు తొక్కేసిన స్వరాలకు ఆయన మరణం సందర్భంగా సానుభూతి ప్రకటించారు. ఇంకొంతమంది ఆయన బ్రాహ్మణాధిపత్యం గురించి కూడా మాట్లాడారు.

నేను సైగల్, మన్నాడే, కిషోర్, రఫీ, జేసుదాసు, హరిహరన్, సురేష్ పీటర్, ఘంటసాల, పి.బి. శ్రీనివాస్, ఏ.ఎం.రాజా, జానకి, సుశీల, లత, గీత, ఆశ – ఇలా ఎంతోమంది గాయకులతోపాటు బాలసుబ్రహ్మణ్యాన్ని కూడా వింటాను. వాళ్లందరూ ఎక్కడ చదువుకున్నారో , ఏమి చదువుకున్నారో , సంగీతంలో వాళ్ల గురువులెవరో నాకు తెలియదు. కానీ బాలు ఇంజనీరింగ్ చదువుకున్నాడని, సంగీతంలో సరిగమలు కూడా తెలియదని ఆయనే పలుసార్లు చెప్పుకోగా విన్నాను, చదివాను.

ఆయన రుద్రవీణలో బిలహరి కాదు కానీ, కచ్చితంగా సూర్యమే.

ఘంటసాలను 'మాస్టారూ...' అంటూ దూరంగా ఉండి ఆశ్చర్యాద్భుత నేత్రాలతో భక్తిప్రపత్తులతో చూసిన నేను, పైన చెప్పిన వాళ్లందరినీ ఒక్కసారి కూడా చూడలేదు. కానీ బాలును కొన్ని వందలసార్లు చూసి వుంటాను. పరోక్షంగా అయినా సరే, కొన్ని వందలసార్లు మాట్లాడి వుంటాను. అతడు చూపించే వినయానికి చిరాకుపడి, అంత వినయంగా ఉండక్కరలేదు అంటూ, "బాలసుబ్రహ్మణ్యమూ – వినయమూ" అంటూ రాసాను కూడా. అలా అతడి సుగుణాలు, లోపాలు నాతో పాటు నా తరం మొత్తానికి తెలుసు. అలా ఓపెన్‌గా ఉండటమే అతడి విజయం అనుకుంటాను.

మిగతా గాయకులలా కాకుండా విపరీతంగా జనంలోకి వెళ్లడమే అతడి మరణం కలిగిస్తున్న ఇంతటి దుఃఖానికి కారణం అనుకుంటున్నాను. వీధి చివర మరణానికీ, ఇంట్లో మరణానికీ తేడా ఉంటుంది కదా! బాలూ మరణం ఇంట్లో సంభవించిన మరణం. ఈ దుఃఖం ఇప్పట్లో తీరదు.

అతడి విజయం అతడు పదహారు భాషలలో పాడిన నలభైవేల పాటలలో లేదు. తన స్వరాన్ని పాటకు అనుగుణంగా మలచుకున్న తీరులో వుంది. తనకు తెలియనిదానిని తెలుసుకుని ఆత్మలోకి తీసుకుని పాడటంలో వుంది. తనకు వచ్చిన ప్రతి అవకాశాన్నీ వినియోగించుకోవడంలో వుంది. తనను తాను విస్తరింపచేసుకోవడంలో వుంది. పాడుతూ నేర్చుకోవడంలో వుంది. తనకు ఆవగింజంతైనా నేర్పిన గురువులను జ్ఞాపకం పెట్టుకోవడంలో వుంది. ఆ జ్ఞాపకాలని సమయం వచ్చినప్పుడల్లా పంచుకోవడంలో ఉంది. అప్పుడెప్పుడో ధిషణాహంకారంతో విశ్వనాథ 'నాలాంటి శిష్యుడు దొరకడం చెళ్లపిళ్ల వెంకటశాస్త్రిగారి అదృష్టం' అన్నాడట. బాలులాంటి శిష్యుడు దొరకడం రసరాగాలబాణీ కోదండపాణి అదృష్టం. తన రికార్డింగ్ థియేటర్‌కి బాలు పెట్టుకొన్నపేరు కోదండపాణి రికార్డింగ్ థియేటర్.

తన ముందుతరాలను బాలు మరచిపోలేదు. తన తరువాతితరాన్ని తయారుచేయకుండా ఉండనూ లేదు. అయినా బాలు అందరినీ తొక్కేసాడనే అంటారు. అందులో కొంత నిజం ఉండవచ్చు . మరికొంత అతిశయోక్తీ ఉండవచ్చు. విజయం వెంట పరుగులు తీసే చిత్రపరిశ్రమ బాలు విజయం వెనుక పరుగులు తీసిందేమో! ఎవరికీ పాడితే వారే పాడినట్లు అనిపించేలా పాడటం బాలుకి మాత్రమే తెలిసిన విద్య. అది మిమిక్రీ అయితే మాత్రమేమిటి? ప్రజలను రంజింపచేశాక!



# సంస్కారం నేర్పిన మహానుభావుడు

**- సిరివెన్నెల సీతారామశాస్త్రి**

సినీగేయ రచయిత

"**అ**కాలసూర్యాస్తమయం ఇది. చాలామంది గాయకులు వస్తారు. వచ్చిన ప్రతివాళ్లూ వెళ్తారు. నిజానికి కొందరు వస్తారు.. వెళ్లరు. వాళ్లు వెళ్లారనుకుంటున్న రోజుని.. కాలం వాళ్ల పేరుతో మళ్లీ కొత్తగా పుడుతుంది. ఈరోజు ఒంటిగంటకి తెలుగువాళ్ల ఇళ్లలో కాలం మళ్లీ ఆయన పేరుతో పుట్టింది. అందరూ మాట్లాడుతున్నారు. కానీ.. అందరి గొంతు మూగబోయింది. అందరి గుండెలు మూగబోయే ఉన్నాయి. ఆయన గొప్పతనం గురించి మాట్లాడే ముందు.. సినిమాపాట పట్ల సమాజానికి పెద్ద ఆరాధ్యమైన భావన ఏదీ లేదు. అలాంటి సినిమాపాటకి ఒక అద్భుతమైన స్థాయిని తెచ్చిన గాయకుడు. తెలుగు సినిమాపాటల ప్రాతినిధ్యం బాలుగారు. పాట పట్ల ఆయనకున్న అక్కర.. పాట పట్ల ఆయన చేసిన పూజ అసామాన్యం. ఇరవై సంవత్సరాలుగా పాడుతా తీయగా.. స్వరాభిషేకం లాంటి కార్యక్రమాలతో ప్రతి ఇంట్లోనూ విస్మరించలేని స్థానం సంపాదించుకున్నారు. కొన్నాళ్ల తర్వాత కాలం చేసిన గాయం మానినా.. మళ్లీ ఆయన గానం వినగలమా? పోనీ ఏదైనా పాట వింటే బాలుగారు గుర్తుకు రారా..?

సంగీతప్రపంచానికి ఆయనో మహావిశ్వవిద్యాలయం. చాలా సందర్భాల్లో ఆయన అతి చేస్తున్నారు అన్నారు. కానీ, పాటలో మాట పట్ల ఆయనకున్న మక్కువ...దాని ఉచ్చారణ విషయమై ఆయన పడే ఆవేదన... సంగీత సరస్వతిదేవికి ఆయన చేసిన పూజ అది. ఆయన మరో పాతిక సంవత్సరాలు కనీసం

సినీసంగీతానికి సేవ చేయాల్సి ఉంది. ఆయన ఎన్నో వేల పాటలు పాడారు. ఎంతోమందికి స్వరం అరువిచ్చారు. కానీ, ఇప్పుడు బాలు ఎక్కడ? ఇప్పుడా పెద్దదిక్కు లేదు. ఆయన్ని అనుకరించాలన్న ఆలోచన లేదు. సినీ పరిశ్రమకు ఆయన నలభైవేలమంది బాలులను కానుకగా అందించారు. భారతీయ చలనచిత్రపరిశ్రమ ఉన్నంత వరకు బాలు ఉంటారు. ఇప్పుడు నా దుఃఖం రెండు రకాలు. ఇకపై సమాజానికి సాంస్కృతికపరమైన ఆచార్యుడెవరు? పాట వెనుక ఓ సంస్కారం ఉందని బోధించే ఆచార్యుడు ఎవరు? ఆయనకిప్పుడంత వయసేమొచ్చిందని.. 74ఏళ్లకే వెళ్లిపోవక్కర్లే. వ్యక్తిగతంగా నా నష్టం గురించి ఇప్పుడు మాట్లాడొచ్చో లేదో కూడా తెలియట్లేదు. 'గంగావతరణం' గీతం పాడి వినిపించినప్పుడు.. బాలు కుర్చీలోంచి.. కళ్లలో నీళ్లు పెట్టుకుంటూ లేచి.. 'మీరు ఎన్నో వందల పాటలు రాయాలని, నేను పాడాలని అనుకుంటున్నా' అన్న ఆయన మాట నాకు సుబ్రహ్మణ్యస్వామి దీవెనలా వినిపించింది. నా పెద్దదిక్కు, నా సాహిత్యం తాలూకు దన్ను నువ్వే. రేపు నా పాట ఎవరు పాడతారు? నా గురించి ఎవరు మాట్లాడతారు? నీకు నాపట్ల ఎంత బెంగ ఉండేదో నాకు తెలుసు. తోడబుట్టినవాళ్లకు కూడా అంత ప్రేమ ఉంటుందా? పాట పాడడం కళ మాత్రమే కాదు. తపన ఉండాలి. అలాంటి వ్యక్తికి అనారోగ్యం ఏమిటి? ఆయన మూగబోవడం ఏమిటి? నాకు ఈ ఓదార్పు నాకు సరిపోవడం లేదు.

చాలామంది అంటుంటారు, వెళ్లే సమయం వచ్చినప్పుడు ఎవరూ ఆగరని. కానీ, బాలు వెళ్లే సమయం కాదిది. ఆయన ఉనికి ఇంకా భౌతికంగా ఉండాల్సింది. ఆయన ఎన్ని ఇళ్లలో పాటల దీపాలు వెలిగించాడు. ఎంతమంది ఆడపిల్లల ఆహార్యాన్ని తెలుగుదనానికి తగ్గట్లుగా సరిదిద్దారు? ఎంతమంది గాయకుల్ని... గానసరస్వతి పూజారులుగా తయారు చేశారు? అన్నది నిరంతరం గుర్తుపెట్టుకోవాల్సిన విషయం. ఆయన పాట గాలి ఉన్నంత కాలం ఉంటుంది. మనం ఊపిరి తీసినంత కాలం ఉంటుంది. కానీ, ఆయనిచ్చిన సంస్కారాన్ని మాత్రం మనం మర్చిపోకూడదు. ఇప్పుడు ఆయన ఆత్మ శాంతించాలి అని కోరుకుంటే సరిపోదు. ఇది మన ఆత్మలు ఘోషిస్తున్న రోజు.

*(ఈనాడు, 26.09.2020)*

గానానికి ప్రాణం సాహిత్యం. కంటితో విని సరిపెట్టుకోకుండా చెవితో చూడగలిగితే సినిమాపాటలో వున్న సాహిత్య చిత్రాలు అర్థమవుతాయో. అలాటి చిత్రాలు వేసినవాడు, రాసినవాడు శ్రీ శ్రీ. రాసిన పాటకి ట్యూన్ కట్టుకున్నా, చేసిన పాటకు ట్యూన్ రాబట్టుకున్నా శ్రీ శ్రీ శ్రీశ్రీయే. అందుకే ఆయన మహారాజశ్రీ శ్రీ శ్రీ.

(శ్రీ శ్రీ గురించి బాలు)



# ఎవరండీ ఈ బాలసుబ్రహ్మణ్యం?

– **మంగు రాజగోపాల్**
పాత్రికేయులు

ప్రపంచవ్యాప్తంగా కొన్ని కోట్ల కళ్ల రిజర్వాయర్లకు రెప్పల గేట్లు ఎత్తించేసి కన్నీటి ప్రవాహాలను దూకిస్తున్న ఆ మనిషి ఎవరండీ?

కొన్ని కోట్ల గొంతుకల్లో గుండెల్ని అడ్డం పడేసి గుండెకీ, గొంతుకకీ మధ్య కొట్లాట పెడుతున్న ఆ మహానుభావుడెవరండీ? ఇంట్లో కన్నతండ్రి, బాబాయో, అన్నయ్యో దాదాపు రెండు నెలలుగా ఆస్పత్రిలో చావు బతుకుల మధ్య ఊగిసలాడుతూ, అలుపెరగని రీతిలో మృత్యువుతో పోరాడుతుంటే, ఇంట్లో వారు ఎంత తల్లడిల్లిపోతారో, ఎలా బిక్కచచ్చిపోతారో... అలా ప్రతి ఇంటింటా ఒక ఉద్విగ్నవాతావరణాన్ని సృష్టించిన ఆ జీవన్మరణ పోరాటయోధుడెవరండీ?

తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం, హిందీ.. అన్ని భాషలవారినీ కామన్‌గా మూగభాషలో ఏడిపిస్తున్న ఆ సకలభాషాపారంగతు డెవరండీ? హిందూ, ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైన్... ఇలా అన్ని మతాలవారికి సమ్మతమై, తన ఆరోగ్యం కోసం సతమతమవుతూ సర్వమత ప్రార్థనలు చేయిస్తున్న ఆ సకల మానసచోరుడెవరండీ?

ఇంతకీ ఎవరండీ ఈ బాలసుబ్రహ్మణ్యం? లక్షలాదిమందిని ఏకతాటిమీద నడిపిస్తున్న జాతీయ నాయకుడా? కాదు... లక్షలాది గొంతుల్లో తన గానాన్ని పలికిస్తున్న జాతి గాయకుడు. లక్షలాది గుండెల్లోకి చొరబడి అరవై ఏళ్లుగా ఇంకెవరూ కట్టా చెయ్యలేని గూడు కట్టుకుని స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న ఆ చొరబాటుదారుడు ఇంకెవరూ?

శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం అనే గానగంధర్వుడు.

కర్ణుడు కవచకుండలాలతో పుట్టినట్టు ఈ గంధర్వుడు గొంతులో అమృతభాండాన్ని దాచుకుని అవతరించాడు. పేరెంత పొడుగ్గా ఉన్నా 'బాలు' అనే రెండక్షరాల ముద్దుపేరుతో మన ఇంటిబాలుడైపోయాడు. దశాబ్దాలుగా తరగని తన గానామృతాన్ని పంచిపెడుతూనే వచ్చాడు. విభిన్న కథానాయకులకు వారి కంఠస్వరంతో ఒదిగిపోతూ తన పాటల్ని పాడిగాడు. కేవలం హీరోలకు మాత్రమే కాదు, హాస్యనటులకు, క్యారెక్టర్ ఆర్టిస్టులకు కూడా పాటలు పాడి తన ప్రతిభని నిరూపించుకున్నాడు. ఎన్నో పాత్రలకి గాత్రదానం చేసి డబ్బింగ్ ఆర్టిస్టుగా కూడా రాణించాడు.

"పాటలు పాడటమే కాదు, పాటలకి బాణీలు కట్టడం కూడా నాకు వచ్చు సుమా" అంటూ మన బాలు కొన్ని సినిమాలకి సంగీతదర్శకత్వం కూడా చేసి తెలుగు ప్రజానీకానికి సూపర్ హిట్ గీతాలు అందించాడు. బాలు సంగీతంలో సవ్యసాచి మాత్రమే కాదు, త్రివిక్రముడిలా నటనా రంగంలో కూడా కాలు మోపి, తన నటనావైదుష్యాన్ని ప్రదర్శించాడు. సకలకళావల్లభుడు అని నిరూపించుకున్నాడు. అమృతం తీపిగా ఉంటుందంటారు. బాలు గానం అమృతమైతే, వినయవిధేయతలతో కూడిన ఆయన వ్యక్తిత్వం తేనెలాంటిది. ఈ రెండూ మేళవిస్తే అదెంత మధురంగా ఉంటుందో బుల్లితెర మీద ఆయన కార్యక్రమాలు లోకానికి చాటిచెప్పాయి.

మెడికల్ కాలేజీలు డాక్టర్లని తయారుచేస్తాయి. ఇంజనీరింగు కళాశాలలు ఇంజనీర్లని అందిస్తాయి. కానీ, మన బాలు అనే ఒక సంగీతవిశ్వవిద్యాలయం కొన్ని వందల పసిగాత్రాలను లోకానికి పరిచయం చేసి భావిగాయకులుగా తీర్చిదిద్దింది. అ అంటే అమ్మ, ఆ అంటే ఆవు అని అక్షరాలు దిద్దిన పసికూనలకి సంగీతంలో 'ఘ' అంటే ఘంటసాల అనీ, 'సు' అంటే సుశీల అనీ, 'జ' అంటే జానకి అని కూడా నేర్పింది. త్యాగయ్య, అన్నమయ్య వంటి వాగ్గేయకారుల గీతాలపై మక్కువ పెంచి వాటి సారాన్ని తెలుసుకునేలా బోధించింది. తన పాటలతో మన మనసులను దోచుకున్న బాలు ఇలాంటి బుల్లితెర కార్యక్రమాలతో అమాంతం మన డ్రాయింగ్ రూములో తిష్ట వేసుకుని మన కుటుంబసభ్యుడైపోయాడు.

యువతరానికి అలనాటి కవుల సాహిత్యం గురించీ, అలనాటి మధురగీతాల గురించీ ఒక ఉపాధ్యాయుడిలా బోధించిన బాలూకి రెండు చేతులూ ఎత్తి మొక్కడం తప్ప ఇంకేం చెయ్యగలం? మనం బాలు పాటలంటే చెవి కోసుకుంటాం. కానీ బాలు తెలుగుభాష అంటే రెండు చెవులు కోసుకుంటాడు. ఏ

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Balu+Patavai+Vachchavu+Bhuvananiki**

* * *